బంధించిన దరిద్రం

పాతూరి ప్రసన్నం

పై కప్పు అక్కడక్కడ వూడిపోవటం వల్ల యేర్పడ్డ కంతల్లోనుంచి ఆ పూరికొంపలోకి ఎండ తొంగి చూస్తోంది నేలమీద తెల్లరంగు మరకలు వేసింది సూర్యకాంతి

ఎండా వానా నిరాఘాటంగా వస్తూ పోతూ వుంటాయి ఆ కొంపలోకి ఇద్దరుండటానిక్కూడా చాలీ చాలని ఆ కొంపలో ఒకమూల పొయ్యి విసుర్తూ అన్నంవండుతోందిరత్తి చవకరకం మట్టిఎడతల్లోని వంకాయ యిగురు పగిలినకుండపెంకులోపెట్టిన పచ్చడీ వేసుకుని చారువేసి ఇన్నిగింజలు వుడకేసి ఇంత సుబ్బయ్యమావముఖాన రాల్చి తనూ రెండుమెతుకులు నోట్లో వేసుకుంటే — తర్వాత చెయ్యాల్సిన పని చూసుకోవచ్చు అనుకుంటూ వొళ్ళు విరుచుకుంది బద్ధకంగా రత్తి

ఇంటి నిట్టాడిస్తంభం వోరగా వొంగిపోయి కూలిపోతున్న మనుషుల జీవితాల్ని సూచిస్తోంది సాంకేతికంగా

ఎత్తుగా మట్టిదిన్నెమీద రొండు ట్రంకుపెట్టెలున్నాయి ఒకటి మూలలు సొట్టపడి మూత వంకరపోయి కొక్కెం వూడిపోయివుంది ఒకటి బాగానే వుంది ఒకప్రక్క చింకిచాపమీద సుబ్బడుకూర్చుని వున్నాడు అతని వెనుకనే నిలబెట్టివున్న కుక్కిమంచం ఇవీ ఆ కొంపలోని వస్తువులు

పొయ్యి మండటంలేదు జబ్బులు పొయ్యేట్టుగా ఎంత విసిరినా కళ్ళు మండేట్టుగా పొగరావటంతప్ప మండటం లేదు సగంవిరిగిన విసినికర్రను విసురుగా నేలమీద గిరాటేసి తీవ్రంగా సుబ్బడువంకచూసింది

పాడుకొంపలూ పాడు మనుషులూ! అబ్బబ్బ? వూపిరిపీల్చుకోటం కూడా కష్టంగావుంది ఒక్కసారి అటుపోయి రంగన్నమావకొంప సూడు ఆడ్ని సూసయినా గానం తెచ్చుకోవాలి! వొచ్చేది వానాకాలం గందా ఇంటికి ఆక్కప్పం చొద్దూ! మొండికేసిన మొద్దులాగా కూకుంటేసరి! రంగన్నేనయం పెళ్లానికి గొలుసుకూడా కొన్నాట్ట — ఇదుగో సుబ్బయ్యమావా! ఈరకంగా ఇంటి గొడవ పట్టించుకోకుంటే నాదోవ నే జూసుకుంటా! రత్తిలేచి తన పెట్టె దగ్గరకు నడిచింది

చామనచాయరంగు ముఖంమీద ముసురుకున్న ముంగురుల్ని వెనక్కి సద్దుకుంటూ తన చీరల్ని రయికల్ని ఒకపెట్టెలో సద్దింది

గయితే ఎల్లిపోతానంటవా రత్తీ! జాలిగా భయంగా చూస్తూ గొణిగాడు సుబ్బడు సగంకాలిన బీడీని నేలమీద రాచి ఆర్పాడు

అవతల అన్నం పొంగి మెతుకులు పొయ్యిలో పడుతున్నాయి సుబ్బడి

ప్రశ్నకి సమాధానం ఇవ్వకుండానే గబగబా కొయ్యతెడ్డుతో అన్నాన్ని కలియబెట్టి, నిప్పు సరిచేసి పొయ్యిముందు కూలబడింది

"ఎల్లిపోతానంటావా రత్తీ! నన్నిడిచి ఎల్లిపోతావా!'' ఈసారి అతని గొంతుక జీరపోయింది తనముఖంలోని ఆవేదన కనిపించనీకుండా తల వొంచుకు కూర్చున్నాడు

''ఆ, తప్పకుండా లేచిపోతా చెప్పి మరీ లేచిపోతున్నా నన్నేమన్నా అడ్డు పెట్టగలవా చెప్పు!'' కోపంగా ప్రశ్నించింది

వర్షాకాలంలో వరదలుగా ప్రవహించే నదినీటిని ఎవరన్నా ఆపగలరా? — అలాగే రత్తిని ఆపటంకూడా ఎవ్వరికీ సాధ్యంకానిపని అని సుబ్బడుకి తెలుసు!

రత్తి తనజీవితంలో కలిసిపోయి యింకా ఆరునెలలు కాలేదు సర్వనాశనం కానున్న తన జీవితంలో ఆశలు రేకెత్తించి ఇకా ఆరు నెలలు కాలేదు. దరిద్రంతో నికృష్టంగా వెళ్తున్న రోజుల్ని సంతృప్తితో నింపివేసిన రత్తి వెళ్ళిపోతోంది!

ఆర్నెల్లకు ముందు తానెవరో రత్తి ఎవరో!

రత్తి తనకు మూడో పెళ్ళాం!

మొదటి పెళ్ళాం రోగంతో చచ్చింది

రెండో పెళ్ళాం కాన్పులో పిల్లాడితో సహా చచ్చింది

రత్తి మూడోది! — ముత్యంలాంటి, రత్నంలాటి రత్తి!

రత్తిని గురించి సుబ్బడి కేమీ తెలీదు! రత్తీ చెప్పలేదు

చెడిబతికిందని, ఎవరో అంటే విన్నాడు అలాటి రత్తి ఇలా ఎందుకు వచ్చిందో, తననే ఎందుకు పెళ్ళిచేసుకుందో సుబ్బడుమావకు తెలీకపోయినా ''రత్తి నా భార్య!'' అనుకుని సంతృప్తి పడ్డాడు

అలాటి రత్తి వెళ్ళిపోతోంది!

అవును వెళ్ళక ఏం చేస్తుంది? తన దరిద్రంతో తలమొత్తింది ఆమెకు! ఈ నరకాన్ని అనుభవించలేక మళ్ళీ ఎలా వొచ్చిందో అలానే రెక్కలతో ఎగిరి పోతుంది!

వొళ్ళు జలదరించింది సుబ్బడు మావకు! లక్ష్మీదేవి వెళ్ళిపోతున్నట్లుగా కలవరిస్తున్నాడు

''గయితే ఎల్తానంటావా!'' జాలిగా భయంగా గొణిగాడు

"ఎళ్తాను, ఎళ్తాను, ఎళ్తాను. రేపు పొద్దుగాల బండీలోనే ఎళ్తుండాను సరేనా!'' అంది ఈర్ష్యగా రత్తి సుబ్బడంటే అసహ్యం కలుగుతోంది రత్తికి

సుబ్బడుకళ్ళలో నీళ్ళు చూసింది రత్తి

"రెప్పొద్దుగాల, రెప్పొద్దుగాల..." అనుకుంటూ సుబ్బడు అమాంతంగా లేచి సుడిగాలిలా వీధినపడ్డాడు. వీధి మలుపులో రోడ్డుమీద దుమ్ములో కనిపించకుండా పొయ్యాడు

"మావా! సుబ్బడు మావా! అన్నం తినిపో, అన్నంతినిపో!"

ఎలుగెత్తి పిలిచినా లాభం లేక పోయింది.

"పిచ్చి మడిసి.

నేను ఎల్తున్నానని నిజంగా నే పిచ్చెత్తింది!

కాదు —

బతకలేక, బతకటం చేతకాక, ఏ కారుకిందోపడి చచ్చిపోదామని పోతుండాడు! — గయితే నేను రాకముందు ఎలా బతికాడు, నేనుపోతే ఎందుకు బతకలేడు నేనేమన్నా సంపాయించి పెడుతుండానా?

కాదు —

కనిపించకుండా ఎక్కడికో పారిపోతుండాడు. డబ్బుతో పడిచచ్చే పెపంచం వొదిలి ఏ అడివిలోకో పడిపోతుండాడు"

రకరకాలుగా ఆలోచించింది రత్తి

చుట్టూ కలయ చూసింది!

తన కొంప ప్రక్కగా కంపు కొడుతున్నది మురిక్కాలవ.

అందులో పందులు అసహ్యంగా దొర్లుతున్నాయి

ఈ మురికి పేట నిండా ఈగలు, దోమలు

అన్నీ కూలిపోతున్న గుడిసెలు.

వాటిని నిలబెట్టుకోటానికి కూడ గతి లేని దౌర్భాగ్యపు సంసారాలు!

కండలు పిండీ, ఎముకలు విరిచీ, నరాలు తెంచీ చచ్చేరీతిగా చాకిరి చేసుకున్నా కడుపునిండని జీవితాలు

పాలుచాలక యేడ్చే పసికందులు

చద్దిబువ్వలేక ఆకలితో అలమటించే చిన్నపిల్లలు,

"సంసారాన్ని పోషించాలి!" ఇది మొగాడి గొడవ!

"చంటిదానికి కాసిన పాలన్నాపోసి బతికించాలి" ఇది ఆడదాని ఘోష

రంపపుకోత పెడుతోంది బతుకు మనస్సు విరిగింది మానం, అభిమానం చచ్చింది నాలుగణాలు కావాలి! కామంతో కళ్ళు మూసుకుపోయిన నరపశువుకు శరీర సర్వస్వాన్ని ఆహుతి చేసింది ఒక ఆడది!

— పుట్టినందుకు చావకుండా బతకొద్దూ మరి—

రత్తికి కళ్ళు తిరిగినై విసిరి వేసినట్లుగా వీధిలోంచి కొంపలోకి పడిపోయింది నేలమీద పడుకుని చాలా సేపు ఏడ్చింది రత్తి

గడిచిన బ్రతుకంతా రత్తి కళ్ళముందు సినిమాలాగా కదిలింది

నీతి నియమాలకు స్వస్తిచెప్పి భోగాల్లో, విలాసాల్లో జీవితాన్ని పెట్రో

ల్లాగా వెలిగించటం, కుళ్ళి కృశించి నశించి పోకముందే ఆ కాగితంపువ్వు ళ్ళాటి బతుకుమీద రోతపుట్టటం, అనాధ లాగా మురికిపేట రావటం, సుబ్బడు మావ సరసన చేరటం !

ఆనాటిఅన్యాయండబ్బులోసుఖంలేదు
ఈనాటి దరిద్రంతో యాతనపడలేదు
రత్తికి కునుకు పట్టింది.

*   *   *

చీకటి పడింది.

రాత్రి 'వేట'కోసం రోడ్డు పక్కన విలాసాలు చిందిస్తూ, చవకబారు శృంగారంతో నాలుగురాళ్ళు చేతుల్లో వేసుకోటానికి నైలాను ముసుగుల్లో, గాజులు గలగల్లాడిస్తూ, వెర్రినవ్వుతో కవ్విస్తూ మురికిపేటలోంచి నగరంలోకి నడుస్తున్నారు ఇద్దరు యువతులు.

—జీవితం !—

కల్లుముంతలు ఖాళీ అయి పోతున్నాయి.

— జీవితం —

ఐశ్వర్యంతో విరక్తిచెందినప్రాణి రత్తి దరిద్రంలో నలిగిపోయి తల్లడిల్లి పోతున్నజీవి రత్తి

అలాటి రత్తి చచ్చిపోయింది.

స్వర్గంలో సుఖాన్నీ, నరకంలో బాధనీ అనుభవించి తెలుసుకోవాలి. రత్తి ఆత్మ విశ్వంలో వెతుకుతోంది స్వర్గనరకాల్ని రెంటినీ.

"రత్తీ !" — పెద్దగా వినిపించిన అరుపుతో వులికిపడి ఆలోచనల అంతస్థుల్నించి తేలుకుంది రత్తి.

"నన్నిడిచి ఎళ్ళిపోతావా రత్తీ ఎళ్ళిపోతావా రత్తీ '' సుబ్బడు రత్తి కాళ్ళమీదపడి యేడుస్తున్నాడు పుల్లటి కంపు కొడుతోంది—వాడి నోరు. పూరాగా తాగటంవల్ల కొరివిదయ్యాల్లాగా మెరుస్తున్నాయి, జేవురించిన వాడి కళ్ళు.

"ఎళ్తున్నావా రత్తీ !" — వాడి గొంతు పగిలిపోతోంది

అతని ముఖంలోకి, బయట చీకటి లోకి చూస్తోంది రత్తి.

"రత్తీ' ఎళ్ళిపోతున్నావు కాదూ, ఎళ్ళిపో ' నిన్ను ఆపే సేబలం నా దగ్గర లేదు కానీ నువ్వులేనినాడు నాగతి ఎలా వుంటుందో ఆలోసించి మరీ, ఎళ్ళు. ఎన్నడయినా నేను గుర్తుకొత్తే ..సుబ్బడు మావ తాగుతూ, జేబులుకొడుతూ దొంగతనం చేత్తూ, కూనీలుచేత్తూ చివరికి ఏ జైలులోనో చచ్చాడని...అనుకో !

"ఇంతవరకూ నేను మంచోడ్ని కాదు చెడ్డోడ్నీ కాదు. బద్దకస్తుడ్ని. కాత్తంత తాగటం తప్ప నేం చేసిన పాపం లేదు. నా తాగుడు చూసీ, నా బద్దకం చూసీ అసయ్యించుకుంటావు నువ్వు. కానీ తాగక చేసేదేంటి. తల బద్దలై పోతాంది. బతకటానికి డబ్బు కావాలి సంపాయించలేను. మంచి యిల్లు

కావాలి. కట్టుకోలేను. నీ సంతోసంకోసం నగలూ, నట్రా చేయించాలి కానీ ఎలా తేవటం? మరి ఎందుకు బతకటం... చూస్తూ చూస్తూ ఎలా చావటం! పాపిష్టి డబ్బు కోసం కూనీలు చేయటానికి చేతులు రావు దొంగతనం చెయ్యాలంటే మనస్కొప్పదు నా ఆలోసెనల్తో బుర్ర ఏడెక్కి, నిప్పుకొండలాగా బద్దలైపో తందనే బయంతోనే ఈ తాగుడుకు అల వాటు పడ్డా ... కానీ నువ్వు ఎళ్ళిపో తున్నావు...ఇహ వొంటిరిగా శాంతంగా బతకటం నా చాతగాదు...

''రత్తీ! నీ మీద ఎన్నెన్ని ఆశలు పెట్టుకున్నానో తెల్సా! ఈ తాగుడు నీ కోసం మానేసి, ఇద్దరం కలిసి కాయ కట్టం చేసుకుంటూ బతికినంత కాలం బతకాలనే అనుకున్నాను. నువ్వు ఎళ్ళి పోతున్నావు' ఈ దరిద్రుడి మీద దేవుడికే దయ లేనప్పుడు నీకు మాత్రం జాలెందుకు? నిన్ను సుకపెట్టటానికి ఈ దరిద్రుని దగ్గర ఏవుంది! రత్తీ' మరిసేపోయాను. నీ గాజుల జత కూడా తాకట్టుపెట్టి తాగాను కాదూ' నీ రుణం నా కొద్దు. ఇప్పుడే పోయి ఆడి తల పగలగొట్టయినా నీ గాజుల జత నీ కిచ్చే త్తాను" అంటూ ఆవేశంతో పిచ్చివాడి లాగా సుబ్బడు పరుగెత్తబోయాడు.

"ఆగు, సుబ్బడుమావా!'' గట్టిగా అతనితిచేయి పట్టుకుంది రత్తి

"మరిఎళ్ళే సమయంలో నీకేంబగు మానం యిత్తానుచెప్పు. నాదగ్గిర నయా పైసకు కూడా ఇప్పుడు గతిలేదు...నా చెయ్యిఒదులు...నీ రుణం నాకొద్దు! నీ గాజులజత తీసుకురావాల'' సుబ్బడు ఆవేశంతో వూగిపోతున్నాడు. కానీ వాడి ప్రయత్నం విఫలం అయింది రత్తి పట్టుతో.

"వొదిలిపెట్టు రత్తీ!" గర్జించాడు.

"నాకా గాజులు అక్కర్లేదు." నిండుగా పలికింది రత్తి.

"మరి నాదగ్గిర డబ్బులేదనిచెప్పాగా" దీనంగా అన్నాడు సుబ్బడు.

"నీ డబ్బుతో సంబంధంలేదు నాకు"

"ఏమీ తీసుకోకుండానే పొద్దుగాల ఎళ్ళిపోతావా'"

"ఎక్కడికీ ఎల్లటంలేదు మావా' నేనెక్కడికీ పోటంలేదు. నీ దరిద్రం తోనే నేను కాపురంచేత్తాను.''

సుబ్బడు కనుల్లో నీరు వుబికింది

"నిన్నొకమడిసిని చెయ్యాలి మావా!'' తీయగా అందిరత్తి!

"రత్తి! నారత్తీ'' గుండెకు గట్టిగా అదుముకున్నాడు.

రత్తి పెదవులమీద వెలసిన చిరు నవ్వు రేఖ ఆయింటిలో వెలిగించింది ఆశాదీపాల్ని'

రత్తి కన్నులనుంచి రాలిన ఒక కన్నీటి బొట్టుతో ఆయింటిలో పేరుకున్న దరిద్రం కరిగిపోయింది. ★